సాక్షి ఆదిలాబాద్

శుక్రవారం ၊ 5 ၊ మే ၊ 2023



బదిలీలకు వేళాయె

కేజీబీవీల్లో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది బదిలీల ప్రక్రియ ప్రభుత్వం చేపట్టింది. ఈనెల 5నుంచి 29వరకు ప్రక్రియ కొనసాగనుంది. 8లో▸

ఐసీడీఎస్ డిప్యూటీ డైరెక్టర్‌గా సుభద్ర

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ (జిల్లా సంక్షేమాధికారి)గా సీ సుభద్ర నియమితులయ్యారు. ఆ శాఖ ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి భారతీ హోళికేరి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నల్గొండ జిల్లాలో ఏడీగా పనిచేస్తున్న సుభద్రకు డీడీగా పదోన్నతి కల్పిస్తూ ఇక్కడకు బదిలీ చేశారు. ఇక్కడ జిల్లా ఇన్‌చార్జి సంక్షేమాధికారిగా 2017నుంచి పనిచేస్తున్న కేమిల్కాను కమిషనర్ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.0/25.0

ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. అక్కడక్కడా ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పలుచోట్ల వానలు పడే అవకాశముంది.

న్యూస్‌రీల్

నాణ్యమైన వైద్యసేవలు అందించాలి



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న ఎంపీ బాపూరావు

ఆదిలాబాద్: జిల్లా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేలా కృషి చేయాలని ఎంపీ సోయం బాపూరావు సూచించారు. జిల్లా కేంద్రంలోని భుక్తాపూర్ కాలనీలో గురువారం క్లౌం భూమారెడ్డి హాస్పిటల్‌ను ఎంపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని సౌకర్యాలు, అందించే సేవల గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. జిల్లా ప్రజలకు అధునాతన వైద్యసేవలు అందించేలా ఆస్పత్రిని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఆస్పత్రి నిర్వాహకులు క్లౌం భూమారెడ్డి, డాక్టర్లు క్లౌం వెంకట్‌రెడ్డి, డాక్టర్ క్లౌం జీవిత వెంకట్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, జిల్లాకు చెందిన పలువురు వైద్యులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు నిరంతరం కొనసాగించాలి



తాంసిలో నర్సరీని పరిశీలిస్తున్న డీపీవో

తాంసి: వరుసగా వర్షాలు కురుస్తున్నందున గ్రామాల్లో పారిశుధ్య పనులు నిరంతరం కొనసాగించాలని డీపీవో శ్రీనివాస్ సూచించారు. గురువారం మండల కేంద్రంలో చేపట్టిన పారిశుధ్య పనులను పరిశీలించారు. మురుగు కాలువలు పరిశీలించి ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. అనంతరం నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లతో పాటు నర్సరీని పరిశీలించారు. నర్సరీలో మొక్కల పెంపకంపై శ్రద్ధ పెట్టాలని, మొలకెత్తని విత్తనాలు తొలగించి ఇతర మొక్కలు పెంచాలని సూచించారు. ఎంపీడీవో భూమయ్య, ఎంపీవో సుధీర్‌రెడ్డి, సర్పంచ్ కృష్ణ, కార్యదర్శి గంగన్న, వార్డు సభ్యులు విలాస్, కళ్యాణ్ తదితరులున్నారు.

జేపీఎస్‌ల వినూత్న నిరసన



రంగవల్లులతో నిరసన తెలుపుతున్న జేపీఎస్‌లు

కైలాస్‌నగర్: రెగ్యులరైజ్ చేయాలనే డిమాండ్‌తో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన సమ్మె ఏడోరోజుకు చేరింది. కలెక్టర్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన నిరసన శిబిరం వద్ద గురువారం ముగ్గులు వేసి జేపీఎస్‌లు వినూత్నరీతిలో నిరసన తెలిపారు. గ్రామాల్లో తాము నిర్వహించే విధులు, బాధ్యతలు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను తెలియజేసేలా ముగ్గులు వేశారు. వీరికి టీఎస్‌యూటీఎఫ్, ఎస్టీయూ, పోస్టల్ జాయింట్ కౌన్సిల్ సభ్యులు మద్దతు తెలిపారు. ఆయా సంఘాల నాయకులు సంఘీభావం ప్రకటించారు.

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌కు ఎంపిక



గగన్‌ను అభినందిస్తున్న శ్రీజ

కైలాస్‌నగర్: హైదరాబాద్‌లోని రామాంతపూర్ పబ్లిక్‌స్కూల్‌లో ఒకటోతరగతిలో ప్రవేశానికి గురువారం లక్కీడ్రా నిర్వహించారు. జిల్లాకు కేటాయించిన ఒక సీటుకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు, తల్లిదండ్రుల సమక్షంలో ట్రెయినీ అసిస్టెంట్ కలెక్టర్ శ్రీజ కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో లక్కీ డ్రా నిర్వహించారు. నార్నూర్ మండలం దుప్పపూర్‌కు చెందిన కాంబ్లే గగన్ ఎంపిక కాగా అభినందించారు. జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి సునీత, సహాయ సంక్షేమాధికారి నారాయణరెడ్డి పాల్గొన్నారు.



గర్భిణికి కాల్ చేసి వివరాలు తెలుసుకుంటున్న ఆశ కార్యకర్త

పల్లెలకు తల్లిపిలుపు

- మాతాశిశు మరణాలు తగ్గించేందుకే..
- జిల్లాలో ఐదేళ్లుగా అమలవుతున్న స్కీం
- వైద్యారోగ్యశాఖ ఆఫీస్‌లో కాల్‌సెంటర్
- నెలనెలా గర్భిణుల వివరాలు నమోదు
- గర్భం దాల్చిన నుంచి ప్రసవం దాకా.. అన్ని సేవలందిస్తున్న వైద్యసిబ్బంది



తల్లిపిలుపు కాల్‌సెంటర్ వివరాలు

ఆదిలాబాద్‌టౌన్: గర్భిణులకు కాన్పు పునర్జన్మలాంటిది. నెలలు నిండుతున్నా కొద్దీ ఏవేవో ఆరోగ్య సమస్యలు చుట్టుముడతాయి. ఈ కీలక సమయంలో వారితోపాటు పుట్టబోయే బిడ్డను రక్షించుకోవడం ముఖ్యం. ఏ చిన్న సమస్య వచ్చినా పెద్ద ప్రాణానికి గండమే. ఆస్పత్రికి చేరే సమయంలోనైనా ఏమైనా జరగొచ్చు. ఇలాంటి ప్రసవ గండాలను తప్పించేందుకు అప్పటి కలెక్టర్ దివ్య దేవరాజన్ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జిల్లాలో ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. తల్లిపిలుపు పేరుతో 2018 మార్చి 8న స్కీంను ప్రారంభించారు. ఐదేళ్లుగా స్కీం నిరాటంకంగా కొనసాగుతోంది. సంవత్సరానికి 60 వేల మందికి పైగా కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి సలహాలు, సూచనలు పొందుతున్నారు. సేవలు సద్వినియోగం చేసుకుంటున్నారు. గర్భం దాల్చిన నుంచి ప్రసవమయ్యే దాకా కాల్ సెంటర్ వారు గర్భిణుల యోగక్షేమాలు తెలుసుకుంటున్నారు. ఆరోగ్యంగా ఉండేందుకు సూచనలు ఇస్తున్నారు. బీపీ, షుగర్, ఎనీమియా తదితర వ్యాధులతో బాధపడుతున్నవారిపై ప్రత్యేక దృష్టిసారిస్తారు.

మాతాశిశు మరణాల నియంత్రణకే..

జిల్లాలో మాతాశిశు మరణాలు తగ్గించేందుకు అప్పటి కలెక్టర్ దివ్య దేవరాజన్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆదిలాబాద్ జిల్లాలో ముఖ్యంగా గిరిజన ప్రాంతాలు ఎక్కువగా ఉన్నాయి. అవగాహన లేకపోవడంతో మాత, శిశు మరణాలు చోటు చేసుకోవడంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఏజెన్సీ ప్రాంతంలో ఉండే గర్భిణుల్లో చాలామంది రక్తహీనతతో బాధపడుతున్నారు. పౌష్టికాహారం తీసుకోకపోవడంతో ప్రసవ సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో మాతాశిశు మరణాలు ఎక్కువగా జరిగేవి. కాల్ సెంటర్ ఏర్పాటుతో మరణాలకు చెక్ పెడుతున్నారు. గర్భిణులకు 3, 5, 7, 9 నెలల్లో ఫోన్ చేస్తున్నారు. స్కానింగ్ చేయించుకునేలా, టీకాలు వేయించుకునేలా ప్రోత్సహిస్తున్నారు. ప్రసవ సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా హైరిస్క్ ఉన్న వారి కోసం రిమ్స్ బ్లడ్‌బ్యాంక్‌లో రక్తం అందుబాటులో ఉంచుతున్నారు.

ఒక్క పిలుపుతో స్పందిస్తారు

జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో ప్రత్యేకంగా కాల్ సెంటర్ ఏర్పాటు చేశారు. అత్యవసర పరిస్థితుల్లో గర్భిణులకు రక్తం అవసరమైనా ఒక్క పిలుపుతో స్పందిస్తారు. ఆదిలాబాద్ జిల్లాతో పాటు కుమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్ జిల్లాలకు చెందిన గర్భిణులు ప్రసవం కోసం రిమ్స్‌లో చేరితే వారికి సహాయం అందజేస్తారు. ఎనీమియాతో బాధపడుతున్న వారికి రక్తం అందించేందుకు చర్యలు చేపడతారు. గర్భిణులకు అంబులెన్స్ కూడా సమకూరుస్తారు. ఈ కాల్ సెంటర్‌లో నలుగురు ఆశ కార్యకర్తలు పని చేస్తున్నారు. మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం 6గంటల వరకు ఒక్కొక్కరికి వందమందికి కాల్ చేసే లక్ష్యం ఉంటుంది. అయితే రోజు 60నుంచి 70మందికి ఫోన్ చేసి వివరాలు నమోదు చేసుకుంటారు. ఆరోగ్య సమస్యలు తెలుసుకుంటారు. హైరిస్క్ ఉన్నవారి వివరాలు నమోదు చేసుకుని సంబంధిత వైద్యాధికారులకు వివరాలు తెలియజేస్తారు. తెలుగు, మరాఠీ, గోండి, హిందీ భాషల్లో సేవలందిస్తారు. నెలకు 6,500 నుంచి ఏడువేల మందికి ఫోన్ చేసి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటారు.

ఎన్నో ప్రాణాలు నిలబెడుతోంది

తల్లిపిలుపు కార్యక్రమం ఎన్నో ప్రాణాలను నిలబెట్టింది. మాతాశిశు మరణాలు గణనీయంగా తగ్గాయి. రవాణా సౌకర్యం లేని గ్రామాలకు చెందిన గర్భిణులను వారం, పది రోజులు ముందుగానే ఆస్పత్రిలో చేర్పిస్తున్నాం. పలు పీహెచ్‌సీల్లో బర్త్ వెయిటింగ్ రూమ్‌లను ఏర్పాటు చేశాం. తక్షణ వైద్యం కోసం 102, 108 అంబులెన్స్‌ల ద్వారా ఆస్పత్రులకు తరలిస్తున్నాం. గర్భం దాల్చిన నుంచి ప్రసవమయ్యే వరకు వారి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకుంటున్నాం. హైరిస్క్ ఉన్న వారిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవం జరిగేలా చర్యలు చేపడుతున్నాం.

– డాక్టర్ నరేందర్‌రాథోడ్, డీఎంహెచ్‌వో

ఎంతో ధైర్యాన్ని నింపారు

నేను గర్భందాల్చినప్పుడు తల్లిపిలుపు ద్వారా నాకు ఫోన్ చేశారు. హెచ్‌బీ తక్కువగా ఉందని చెప్పారు. ఐరన్ మాత్రలు వేసుకోవాలని సూచించారు. పోషకాహారంతో కూడిన భోజనం తీసుకోవాలని, టెన్షన్ పడవద్దని తెలిపారు. మూడు నెలల నుంచి ప్రసవమయ్యే దాకా నాలుగైదుసార్లు ఫోన్ చేశారు. ఆస్పత్రికి ప్రసవ సమయంలో ఆశ కార్యకర్త తోడుగా వచ్చింది. 8 నెలలు సమయంలో హెచ్‌బీ పరీక్ష చేస్తే 11.2కు వచ్చింది. చదువుకోని వారికి తల్లిపిలుపు కార్యక్రమం ఎంతో దోహదం చేస్తోంది. వారు నాలో ఎంతో ధైర్యాన్ని నింపారు.

– లక్ష్మి, ఇంద్రవెల్లి

ప్రత్యామ్నాయం వైపు అడుగులు

- కొనసాగుతున్న జేపీఎస్‌ల సమ్మె
- రెగ్యులర్ కార్యదర్శులు, పీఆర్ ఉద్యోగులపై అదనపు భారం
- ఒక్కరికి 3–4 పంచాయతీల బాధ్యత
- సీనియర్ కార్యదర్శుల అయిష్టత



కలెక్టరేట్ ఎదుట సమ్మె శిబిరంలో జేపీఎస్‌లు

కైలాస్‌నగర్: సర్వీస్‌ను క్రమబద్ధీకరించాలనే డిమాండ్‌తో జిల్లాలోని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సమ్మెబాట పట్టిన సంగతి తెలిసిందే. విధులు బహిష్కరించి గత నెల 26నుంచి కలెక్టర్ కార్యాలయం ఎదుట వారు ఆందోళన చేస్తున్నారు. దీంతో పల్లెల్లో పాలన వ్యవహారాలు చూడాల్సిన వారు లేక పంచాయతీల్లో పాలన స్తంభించింది. ఈ నేపథ్యంలో పల్లె పాలనను గాడిలో పెట్టేదిశగా ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలకు ఆదేశించింది. సీనియర్ పంచాయతీ కార్యదర్శులతో పాటు పీఆర్‌లో పనిచేసే ఎంపీడీవోలు, ఎంపీవోలు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు, బిల్ కలెక్టర్లకు పంచాయతీల నిర్వహణ బాధ్యతలు అదనంగా అప్పగించింది. అనుభవం, సామర్థ్యం ప్రకారం ఒక్కొక్కరికి మూడు నుంచి నాలుగు పంచాయతీల బాధ్యతలు కట్టబెట్టింది. కాగా, దీనిపై సీనియర్ కార్యదర్శులు అయిష్టత వ్యక్తం చేస్తున్నారు.

సమ్మెలో 348 మంది జేపీఎస్‌లు

జిల్లాలో 468 పంచాయతీలుండగా 439 మంది కార్యదర్శులు పనిచేస్తున్నారు. వీరిలో 358మంది జేపీఎస్‌లు కాగా, 91 మంది గ్రేడ్ 1 నుంచి గ్రేడ్ 3 కలిగిన రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శులు విధులు నిర్వర్తిస్తున్నారు. తమ నాలుగేళ్ల ప్రొబేషనరీ పీరియడ్ ముగియగా రెగ్యులరైజ్ చేయాలనే డిమాండ్‌తో జేపీఎస్‌లు సమ్మె బాట పట్టారు. ప్రస్తుతం 313 మంది జేపీఎస్‌లు, 35 మంది ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు సమ్మెలో కొనసాగుతున్నారు. వీరంతా తమ విధులను బహిష్కరించి సర్కారు తీరుకు వ్యతిరేకంగా నిత్యం సమ్మె శిబిరంలో పాల్గొని నిరసన తెలుపుతున్నారు. కాగా, మరో పది మంది జేపీఎస్‌లు వివిధ కారణాలతో సెలవులో ఉన్నారు.

పంచాయతీ పాలన సాగేలా..

జేపీఎస్‌లు సమ్మె బాట పట్టడంతో గ్రామాల్లో తాగునీటి సరఫరా, క్లోరినేషన్, పారిశుధ్యం, వీధి దీపాలు, ఉపాధిహామీ పనుల పర్యవేక్షణ నిలిచిపోయింది. జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ, ఇళ్ల నిర్మాణాల అనుమతులు, ఆస్తి మార్పిడి, ట్రేడ్‌లైసెన్స్‌ల జారీ లాంటి కార్యకలాపాలు నిలిచిపోయాయి. ఫలితంగా పల్లె ప్రజలు ఇబ్బంది పడకుండా ఉండడంతో పాటు పాలన వ్యవహారాలు సక్రమంగా జరిగేలా ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని కలెక్టర్లు, పంచాయతీ అధికారులను ఆదేశించింది. అందుకనుగుణంగా అధికారులు పంచాయతీ కార్యదర్శులతో పాటు పీఆర్ శాఖలో పనిచేసే అధికారులు, ఉద్యోగులకు పంచాయతీలను సర్దుబాటు చేశారు. ఒక్కొక్కరికి మూడు నుంచి నాలుగు పంచాయతీల బాధ్యతలు అప్పగించారు. ఇంతవరకు బాగానే ఉన్నా అదనపు బాధ్యతల నిర్వహణ వారికి కత్తిమీద సాములాగే మారనుంది. గతంలో ఈ వ్యవహారాలన్నీ మ్యాన్యువల్‌గా జరిగేవి. దీంతో కార్యదర్శులు తమకు తోచినప్పుడల్లా ఆ పనులు చే సేవారు. ప్రస్తుతం రోజువారీ పనులు కార్యదర్శులు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లోనే నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో అదనపు పంచాయతీల్లో ఏవిధంగా బాధ్యతలు నిర్వహించాలని వారు తలలు పట్టుకుంటున్నారు. అదనపు బాధ్యతల నుంచి తమను తప్పించాలని అధికారులను కోరుతున్నారు.

నిత్యం పర్యవేక్షిస్తున్నాం

గ్రామపంచాయతీల్లో రోజువారీగా జరగాల్సిన పనులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఉండాలనే ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాం. సీనియర్ కార్యదర్శులతో పాటు ఎంపీడీవోలు, ఎంపీవోలు ఇతర పీఆర్ ఉద్యోగులకు పంచాయతీ అదనపు బాధ్యతలు అప్పగించాం. వారి పనితీరు, గ్రామపాలన వ్యవహారాలపై నిత్యం పర్యవేక్షిస్తున్నాం. గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకుంటున్నాం.

– శ్రీనివాస్, డీపీవో

జిజ్ఞాస పరిశోధన ప్రాజెక్ట్ సందర్శన



ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

ఎదులాపురం: నాంపల్లి ఇందిరా ప్రియదర్శిని మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన రాష్ట్రస్థాయి జిజ్ఞాస విద్యార్థి పరిశోధన ప్రాజెక్ట్‌లో స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొని తమ ప్రాజెక్ట్‌ను ప్రదర్శించారు. కళాశాల తరఫున కామర్స్ విభాగం నుంచి బీకాం మొదటి సంవత్సరం విద్యార్థినులు రంజితా, ఆశ్రిత, ప్రణయ, సానియా, శ్రీలయ, వైష్ణవి 'విద్యార్థులకు వ్యవస్థాపకతపై అవగాహన' అనే అంశంపై పరిశీలకులు కే చంద్రకాంత్, సౌజన్య ఆధ్వర్యంలో ప్రాజెక్ట్‌ను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ జలగం అనిత, జిజ్ఞాస కో ఆర్డినేటర్ సంతోష్‌కుమార్, సిబ్బంది వారిని అభినందించారు.

మెరుగైన రైల్వే సేవలకు కేంద్రం కృషి



భూమిపూజ చేసి పనులు ప్రారంభిస్తున్న ఎంపీ సోయం బాపూరావు, ఎమ్మెల్యే రామన్న

- ఎంపీ సోయం బాపూరావు
- రైల్వే బ్రిడ్జి నిర్మాణానికి భూమిపూజ

ఆదిలాబాద్: జిల్లా ప్రజలకు మెరుగైన రైల్వేసేవలు అందించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీ సోయం బాపూరావు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని సంజయ్‌నగర్‌కాలనీలో గురువారం రైల్వే ఓవర్ బ్రిడ్జి, అండర్ బ్రిడ్జి నిర్మాణానికి ఎమ్మెల్యే జోగు రామన్నతో కలిసి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాంసి, తలమడుగు మండలాలకు చెందిన వాహనదారులకు ఇబ్బందులు తప్పించాలనే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. ఆదిలాబాద్ రైల్వేస్టేషన్‌లో ఫిట్టింగ్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. ఆదిలాబాద్ రైల్వేస్టేషన్ ఆధునికీకరణకు రూ.మూడు కోట్లు కేటాయించి మరిన్ని సౌకర్యాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా ప్రజల చిరకాల వాంఛ ఆదిలాబాద్–ఆర్మూర్ రైల్వేలైన్ సర్వే పూర్తయిందని వెల్లడించారు. ఎమ్మెల్యే జోగు రామన్న మాట్లాడుతూ.. తాంసి బస్టాండ్ వద్ద అండర్ బ్రిడ్జి, సుందరయ్యనగర్ వద్ద ఓవర్ బ్రిడ్జి నిర్మించనుండడంతో పట్టణ ప్రజలు ఏళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కానున్నాయని తెలిపారు. రూ.91.70 కోట్లతో వంతెనలు నిర్మించనుండగా, ఇందులో కేంద్రం రూ.39 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.57 కోట్లు కేటాయించిందని పేర్కొన్నారు. పనులు త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, వైస్ చైర్మన్ జహీర్ రంజాని, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు అలాల్ అజయ్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా పెర్సాపెన్ పూజ



ఊరేగింపుగా వస్తున్న ఆదివాసీ గిరిజనులు

నార్నూర్: గాదిగూడ మండలం ఝరి గ్రామంలో ఆదివాసీ గిరిజనులు గురువారం నాగ్‌బిడ్ మెస్రం వంశీయుల పెర్సాపెన్ (పెద్దదేవుడు), హీరాసుక్క, కిక్కిరికు బావే మహిళలకు ప్రత్యేక పూజలు చేశారు. పాడి పంటలు, పశువులు, తమ కుటుంబం సుభిక్షంగా ఉండాలనే భావనతో ప్రత్యేక పూజలు చేస్తామని గ్రామ పటేల్ మెస్రం సోము, కటోడ మెస్రం నాగోరావు తదితరులు తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ పబ్లిక్ హెల్త్ డాక్టర్స్ అసోసియేషన్ క్యాలెండర్‌ను గురువారం కలెక్టర్ రాహుల్‌రాజ్ తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వైద్యాధికారులు ప్రభుత్వ ఆస్పత్రుల్లో పేదలకు నాణ్యమైన సేవలందించాలని సూచించారు. వైద్యాధికారుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ట్రైనీ కలెక్టర్ శ్రీజ, జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి నరేందర్ రాథోడ్, సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ మెట్‌పెల్లివార్, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు రాహుల్, సంఘ బాధ్యులు విజయసారధి, సుచల, శ్రావ్యవాణి, నైనత, వెంకటేశ్, సర్ఫరాజ్, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

ముఖరా(కె) జిల్లాకే గర్వకారణం



సర్పంచ్ మీనాక్షిని సన్మానిస్తున్న మంత్రి ఐకేరెడ్డి

ఇచ్చోడ: రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో అవార్డులు అందుకుంటున్న ముఖరా (కె) పంచాయతీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకే గర్వకారణమని రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని మంత్రి నివాసంలో ముఖరా (కె) సర్పంచ్ మీనాక్షిని శాలువాతో సత్కరించి మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను వందశాతం అమలు చేస్తూ రాష్ట్రం తరఫున జాతీయ స్థాయి అవార్డుకు ఎంపిక కావడానికి సర్పంచ్ మీనాక్షి, ఎంపీటీసీ సుభాష్ కృషి, పట్టుదల అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు అల్లోల మురళీధర్‌రెడ్డి, రాంకృష్ణారెడ్డి తదితరులున్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు



బావి పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

నార్నూర్: తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. మండలంలోని సుంగాపూర్ పంచాయతీ పరిధి గోండుగూడ ఆదివాసీ గిరిజనుల నీటి కష్టాలపై ఈ నెల 3న 'సాక్షి'లో ప్రచురించిన 'సుంగాపూర్‌లో నీటి గోస' కథనంతోపాటు తుడుందెబ్బ నాయకులు ఇదే సమస్యపై నిరసన తెలుపగా కలెక్టర్ గురువారం గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు కలెక్టర్‌కు సమస్యలు తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. మిషన్ భగీరథ నీటిని సక్రమంగా సరఫరా చేయాలని డీఈ శ్రీనివాస్‌ను ఆదేశించారు. గ్రామాల్లో నీటి సమస్య ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి ఎందుకు తీసుకురాలేదని ఎంపీడీవో రమేశ్, పంచాయతీ కార్యదర్శిని ప్రశ్నించారు. మిషన్ భగీరథ నీళ్లు రాకుంటే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. సర్పంచ్ జాదవ్ జీజాబాయి ప్రేమ్‌సింగ్ పలు సమస్యలు కలెక్టర్‌కు తెలిపి పరిష్కరించాలని కోరారు. అనంతరం చోర్‌గావ్ గ్రామంలో దిశ మోడల్ పాఠశాలను పరిశీలించారు. డీఈఈ రొడ్డ శ్రీనివాస్, తహసీల్దార్ మోతీరాం, ఎంపీవో స్వప్నశీల, ఆర్‌ఐ శకుంతల, తుడుందెబ్బ మండలాధ్యక్షుడు కనక ప్రభాకర్, నాయకుడు మెస్రం మానిక్‌రావు ఉన్నారు.

'సభ విజయవంతం చేయాలి'



సమావేశంలో నినాదాలు చేస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: మహాత్మా జ్యోతీబా పూలే, సావిత్రీబాయి పూలే దంపతుల విగ్రహ నిర్మాణ భూమిపూజ, బహిరంగ సభలో మాలీ కులస్తులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పేట్కులే పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని పూలే విశ్రాంతి భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తలమడుగు మండలం బరంపూర్ గ్రామంలో శుక్రవారం ఉదయం 10గంటలకు పూలే దంపతుల విగ్రహాల ప్రతిష్ఠాపనకు భూమిపూజతో పాటు బహిరంగ సభ ఉంటుందన్నారు. ఈ సభలో మాలీ సంఘం రాష్ట్ర, జిల్లా, యువజన, మండల, గ్రామ కమిటీ సభ్యులతో పాటు కుల బాంధవులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. 22 ఏళ్లుగా మాలీలకు ఎస్టీ హోదా కోసం అనేక పోరాటాలు చేశామన్నారు. తమ పోరాటాలకు స్పందించిన సీఎం కేసీఆర్ మాలీలకు ఎస్టీ హోదా కల్పించాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపినట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి ఆమోదముద్ర వేయాలని కోరారు. అప్పటివరకు మాలీ కులస్తులు విశ్రమించకూడదని సూచించారు. సమావేశంలో అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబన్న, బరంపూర్ మహాజన్ వినోద్, విలాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశిక్షణ శిబిరం ప్రారంభం

ఆదిలాబాద్ రూరల్: అంబేడ్కర్ స్థాపించిన సమతా సైనిక్ దళ్ మాతృ సంస్థ జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని కై లాసనగర్‌లోగల అశోక బుద్ధ విహార్‌లో ప్రశిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో 50 మంది సైనికులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు శాలిక్‌రావ్, అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాబాసాహెబ్ కాంబ్లే, సమతా సైనిక్ దళ్ దయానంద్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. జిల్లాలోని 18 మండలాల నుంచి సమతా సైనిక్ దళ్ మాతృ సంస్థ కోసం సైనికులు శిక్షణ కోసం తరలిరావాలని కోరారు. ఈ సైనిక్ శిబిరానికి ప్రతి ఒక్కరూ హాజరై అంబేద్కర్ కన్న కలలు నెరవేర్చడానికి తమవంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. బౌద్ధ దమ్మ ప్రచారం, ప్రసారం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని, రాబోయే రోజుల్లో ప్రతి ఒక్కరికీ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. మహిళల కోసం మహిళా శిక్షణ శిబిరం, భారతీయ బౌద్ధ మహాసభ ఆధ్వర్యంలో శామినార్ భిక్షువు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని పేర్కొన్నారు. శుక్రవారం బౌద్ధ పూర్ణిమ, వైశాఖ పూర్ణిమ సందర్భంగా బుద్ధ జయంతిని కై లాసనగర్‌లోని అశోక బుద్ధ విహార్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని బౌద్ధ ఉపాసక్, ఉపాసికులు, అంబేద్కర్‌వాదులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం విజయవంతం చేయాలని కోరారు.

క్లుప్తంగా

ఒకరికి కరోనా

ఎదులాపురం: జిల్లా వ్యాప్తంగా గురువారం 38 మందికి కోవిడ్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా ఒకరికి పాజిటివ్ వచ్చినట్లు జిల్లా వైద్యాధికారి నరేందర్ రాథోడ్ ఓ ప్రకటనలో తెలిపారు. రిమ్స్ ఐసోలేషన్‌లో చికిత్స పొందుతున్నారని వివరించారు.

బీఆర్‌ఎస్ కార్యాలయం ప్రారంభోత్సవంలో జిల్లా నేతలు


ఢిల్లీలో మంత్రి కేటీఆర్‌తో జాన్సన్‌నాయక్, దండె విఠల్

ఖానాపూర్: ఢిల్లీలో బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాన్ని సీఎం కేసీఆర్ గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నేతలు పాల్గొన్నారు. ఎమ్మెల్సీ దండే విఠల్, మంత్రి కేటీఆర్ మిత్రుడు ఖానాపూర్ నియోజకవర్గ నేత భూక్య జాన్సన్‌నాయక్ పాల్గొన్నారు. బుధవారం ఖానాపూర్‌లో పర్యటించిన జాన్సన్ నాయక్ రాత్రి మంత్రి కేటీఆర్‌తో కలిసి విమానంలో ఢిల్లీ వెళ్లారు.

సీపీఆర్‌పై 108 సిబ్బందికి శిక్షణ


సీపీఆర్‌పై శిక్షణ పొందుతున్న 108 సిబ్బంది

మంచిర్యాల టౌన్: జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో ఉమ్మడి జిల్లాలో 108 అంబులెన్సుల్లో విధులను నిర్వహిస్తున్న ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లకు సీపీఆర్‌పై గురువారం శిక్షణ ఇచ్చారు. నాలుగు రోజులుగా సీపీఆర్, బేసిక్ లైఫ్ సపోర్టు కార్యక్రమంపై ఈఎంఆర్‌ఐ గ్రీన్ హెల్త్ అధికారులు గజేందర్, అరుణ్ ఆధ్వర్యంలో సీపీఆర్ పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా 108 వాహనాల ప్రోగ్రాం మేనేజర్ సామ్రాట్, కొండలరావు, సతీశ్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలపై తేనెటీగల దాడి


చికిత్స పొందుతున్న బాధితురాలు

పెంబి: మండలంలోని నాగాపూర్‌లో ఉపాధి హామీ కూలీలపై గురువారం తేనెటీగలు దాడి చేశాయి. గ్రామంలోని రావిచెరువు వద్ద కూలీలు పనిచేస్తుండగా పాలకుంట ఎల్లవ్వ, బోసు సురేఖ, పాలకుంట విజయ, బోసు రఘుపతి, పాలకుంట విజయలపై ఒక్కసారిగా తేనెటీగలు దాడిచేసి గాయపర్చాయి. క్షతగాత్రులను ఖానాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

విమానం చక్కర్లు


తక్కువ ఎత్తులో ప్రయాణిస్తున్న విమానం

దండేపల్లి: మండలంలో వారంరోజులుగా ఓ మినీ విమానం(చార్టర్ ఎరోప్లేన్) గాలిలో అతి తక్కువ ఎత్తులో (సెల్‌టవర్‌ను తాకేలా) చక్కర్లు కొడుతోంది. విమానం చక్కర్లు కొట్టడంపై మండల ప్రజలు ఇది ఏమిటి, ఎక్కడది, రోజు ఎందుకు వస్తుందని అని చర్చించుకుంటున్నారు. విమానానికి రాడర్స్ కూడా కనిపిస్తున్నాయి.

బదిలీలకు వేళాయె!

- కేజీబీవీలో బోధన, బోధనేతర సిబ్బందికి ట్రాన్స్‌ఫర్స్
- శనివారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- కొత్త జిల్లాల ప్రకారం బదిలీలు
- మార్గదర్శకాలు విడుదల చేసిన విద్యాశాఖ



మంచిర్యాలఅర్బన్/నిర్మల్‌రూరల్/ఆదిలాబాద్ టౌన్ : ఎప్పటినుంచో ఎదురు చూస్తున్న కస్తూరిబా బాలికల విద్యాలయా(కేజీబీవీ)ల్లో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది బదిలీలకు విద్యాశాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కేజీబీవీలో విధులు నిర్వహించే స్పెషల్ ఆఫీసర్, పీజీ సీఆర్‌టీ, సీఆర్‌టీ, ఏఎన్‌ఎం, అకౌంటెంట్, పీఈటీలకు షిఫ్టింగ్ అవకాశం కల్పించింది. ప్రస్తుతం పనిచేస్తున్న విద్యాలయాల్లో 01-05-23 నాటికి రెండు సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసిన వారు అర్హులుగా ప్రకటించింది. విల్లింగ్ (ఇష్టం)ఉన్న అభ్యర్థులు మాత్రమే బదిలీల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ దేవసేన బుధవారం రాత్రి మార్గదర్శకాలను విడుదల చేశారు. ఈనెల 6 నుంచి 9వరకు https:// transfers. cdse. telangana. govt. in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. దీంతో ఎన్నో ఏళ్లుగా బదిలీల కోసం ఎదురుచూస్తున్న కేజీబీవీ ఉపాధ్యాయులు, ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

షెడ్యూల్ విడుదల.....

కేజీబీవీ ఉపాధ్యాయుల బదిలీల కోసం ప్రభుత్వం షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈనెల 1వ తేదీ నాటికి కేజీబీవీలో రెండు సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసుకున్న వారు బదిలీలకు అర్హులు. బదిలీ కోరుకునే ఉద్యోగులు ప్రభుత్వ వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. అభ్యర్థులు ఇచ్చిన వెబ్ ఆప్షన్ల ప్రకారం వెబ్ కౌన్సిలింగ్ ద్వారా బదిలీల ప్రక్రియ జరుగుతుంది. కలెక్టర్ చైర్మన్ గా, అడిషనల్ కలెక్టర్ మెంబర్‌గా, డీఈవో మెంబర్ సెక్రటరీగా ఉంటారు. సిబ్బంది ప్రస్తుతం పనిచేస్తున్న పాఠశాలలో పనిచేసిన కాలానికి సంవత్సరానికి మూడు పాయింట్ల చొప్పున పనితీరు ఆధారిత పాయింట్లు కేటాయిస్తారు. ప్రాధాన్యత కేటగిరీ కింద వికలాంగులు, వితంతువులు, న్యాయపరంగా విడాకులు పొందినవారు, వివిధ వ్యాధులతో బాధపడేవారు, వివిధ వ్యాధులతో బాధపడే పిల్లలు గల సిబ్బంది, అవివాహితులు, మొదలైన కేటగిరీ ఉన్న వారిని ఉన్నవారికి మొదట ప్రాధాన్యత ఉంటుంది. ఖాళీలతోపాటు పరస్పరం అంగీకారం(ఇష్టపడే) జిల్లా, అంతర్ జిల్లా షిఫ్టింగ్(బదిలీ)కు అవకాశం కల్పించనున్నారు.

ఉమ్మడి జిల్లా కేజీబీవీల్లో బోధన, బోధనేతర సిబ్బంది వివరాలు..

జిల్లా	కేజీబీవీలు	టీచింగ్	నాన్‌టీచింగ్
మంచిర్యాల	18	193	133
ఆదిలాబాద్	17	230	231
నిర్మల్	18	187	206
కుమురం భీం	15	165	126

ఉమ్మడి జిల్లాలో ఇలా...

- మంచిర్యాల జిల్లాలో 18 కేజీబీవీలు న్నాయి. ఇందులో స్పెషల్ ఆఫీసర్ పోస్టు ఒకటే ఖాళీగా ఉంది. పీజీ సీఆర్‌టీలు 63 మందిగాను 32 మంది విధులు నిర్వహిస్తున్నారు. సీఆర్‌టీ, పీఈటీలు 145 మందికి 135, ఏఎన్‌ఎంలు 18 పోస్టులకు 18 మంది పనిచేస్తున్నారు.
- నిర్మల్ జిల్లాలో మొత్తం 18 కేజీబీవీలు ఉండగా అందులో టీచింగ్ విభాగంలో మొత్తం 222 పోస్టులు మంజూరుకాగా 187 మంది పనిచేస్తున్నారు. 35 పోస్టులు ఖాళీలు ఉన్నాయి. నాన్ టీచింగ్ విభాగంలో మొత్తం 252 పోస్టులు మంజూరు కాగా, 206 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. 46 ఖాళీలు ఉన్నాయి.
- ఆదిలాబాద్ జిల్లాలో మొత్తం 17 కేజీబీవీలు ఉన్నాయి. టీచింగ్ పోస్టులు 230 మంజూరు కాగా, ప్రస్తుతం 175 మంది పనిచేస్తున్నారు. 55 ఖాళీలు ఉన్నాయి. నాన్ టీచింగ్ పోస్టులు 332 ఉండగా, 208 మంది పనిచేస్తున్నారు.
- కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో మొత్తం 15 కేజీబీవీలు ఉన్నాయి. ఇందులో టీచింగ్ విభాగంలో 219 పోస్టులు ఉండగా 130 మంది పనిచేస్తున్నారు. 89 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. నాన్‌టీచింగ్ విభాగంలో 216 పోస్టులు ఉండగా 134 మంది పనిచేస్తున్నారు. 72 ఖాళీలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

మూడు విధాలుగా బదిలీలు..

బదిలీల ప్రక్రియ మొత్తం మూడు రకాలుగా జరుగుతుంది. ఉద్యోగుల పరస్పర బదిలీలు, జిల్లాల మధ్య పరస్పర బదిలీలు, జిల్లాలో బదిలీలు ఉంటాయి. ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న ఉద్యోగి పరస్పర అంగీకారంతో బదిలీ అయ్యే అవకాశాన్ని ప్రభుత్వం ఈసారి కల్పించింది. సాధారణ బదిలీలు మాత్రం కొత్త జిల్లాల ప్రకారం జరుగుతాయి. కానీ పరస్పర బదిలీలు కొత్త జిల్లా, ఉమ్మడి జిల్లా ప్రకారం కూడా జరుగుతాయి. స్పౌజ్ విభాగం కింద బదిలీ కోరుకునే వారికి స్పౌజ్ పని చేసే ప్రాంతానికి దగ్గరగా ఉన్న ప్రాంతానికి మాత్రమే ట్రాన్స్‌ఫచేస్తారు. బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల దరఖాస్తు పత్రాలను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల ద్వారా ఏర్పడిన కమిటీ సభ్యులు పరిశీలిస్తారు. ప్రాధాన్యత విభాగం సర్టిఫికెట్లు, పనితీరు ఆధారిత పాయింట్లు, పరస్పర బదిలీ అభ్యర్థన సర్టిఫికెట్లు మొదలైనవి ఆన్‌లైన్‌లో దరఖాస్తు తోపాటు అప్‌లోడ్ చేయాలి. అదేవిధంగా వీటి జిరాక్స్ పత్రాలను ఆన్‌లైన్ దరఖాస్తు పత్రాలతో జత చేయాల్సి ఉంటుంది.

ఇదీ షెడ్యూల్....

బదిలీల ప్రక్రియ మొదలు : 05-05-2023
ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు : మే 6 నుంచి 9 వరకు
ఆన్‌లైన్ దరఖాస్తులను జిల్లా కార్యాలయంలో సమర్పించే తేదీ : మే 10,11 తేదీల్లో
దరఖాస్తుల పరిశీలన, ఆమోదం : మే 12 నుంచి 15 వరకు
పాయింట్లతో కూడిన జాబితా విడుదల : మే 16
అభ్యంతరాలు సమర్పించు తేదీలు : మే 17, 18
అభ్యంతరాల పరిశీలన తేదీలు : 18, 19
తుది జాబితా విడుదల : మే 20
వెబ్ ఆప్షన్స్ నమోదు తేదీలు : మే 21, 22
వెబ్ ఆప్షన్స్ పరిశీలన, ఆమోదం తేదీలు : మే 23, 24
వెబ్ అలాట్‌మెంట్ బై టీఎస్ ఆన్‌లైన్ : మే 25, 26
బదిలీల ఉత్తర్వులు, జాయినింగ్ : మే 27 నుంచి 29 వరకు

సద్వినియోగం చేసుకోవాలి



కేజీబీవీలో పనిచేసే ఉపాధ్యాయ సిబ్బందికి బదిలీల ప్రక్రియ నేటి నుంచి ప్రారంభమవుతుంది. సిబ్బంది ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఎలాంటి అవకతవకలు జరగకుండా పగడ్బందీగా పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో ఈ ప్రక్రియ కొనసాగిస్తాం. సుమారు 25 రోజుల పాటు ఈ ప్రక్రియ కొనసాగుతుంది.

– రవీందర్‌రెడ్డి, డీఈవో, నిర్మల్

కేజీబీవీల్లో షిఫ్టింగ్‌కు ఉత్తర్వులు



జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు, సిబ్బందికి షిఫ్టింగ్ పద్ధతిలో బదిలీల కోసం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈనెల 6నుంచి 9వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. రెండేళ్ల సర్వీస్ పూర్తయినవారికే అవకాశం ఉంది. వీటికి సంబంధించి పూర్తి మార్గదర్శకాలు వెబ్ సైట్‌లో పొందుపర్చడం జరిగింది.

– ప్రణీత, డీఈవో, ఆదిలాబాద్

ఔను.. వారిద్దరూ కలిశారు..!



వారి పార్టీలు వేర్వేరు. రాజకీయంగా ఒకరిపై ఒకరు విమర్శలు గుప్పించుకుంటారు. పార్టీ, ప్రభుత్వాల పరంగా నిత్యం విబేధించుకుంటారు. వారే బీజేపీకి చెందిన ఎంపీ సోయం బాపూరావు, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే జోగు రామన్న. గురువారం జిల్లా కేంద్రంలో జరిగిన ఓ కార్యక్రమంలో వీరిద్దరూ కలుసుకున్నారు. ఒకరినొకరు అప్యాయంగా పలుకరించుకుని కరచాలనం చేసుకున్నారు. పక్కనే ఉన్న మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్‌ను తన తనయుడంటూ ఎమ్మెల్యే పరిచయం చేయబోగా.. తనకు తెలుసునన్న ఎంపీ అతడినీ పలకరించగా వారి మధ్య చిరునవ్వులు విరబూశాయి.

- సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

కేసీఆర్ తాతా.. మొర ఆలకించరూ...



కలెక్టరేట్ ఎదుట కొనసాగుతున్న జేపీఎస్‌ల సమ్మె ఏడోరోజుకు చేరుకుంది. గురువారం జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు తోడుగా వారి పిల్లలు పాల్గొని 'కేసీఆర్ తాతా.. మా అమ్మానాన్నల మొర ఆలకించరూ..' అని ప్లకార్డులు పట్టుకుని ప్రదర్శించడం చూపరులను ఆకట్టుకుంది.

- సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

హత్య కేసులో ముగ్గురి రిమాండ్

- వివరాలు వెల్లడించిన డీఎస్పీ జీవన్‌రెడ్డి


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

మామడ(నిర్మల్): మండల కేంద్రానికి చెందిన మేకల సంత నిర్వాహకుడు షేక్‌చాంద్ హత్య కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ జీవన్‌రెడ్డి తెలిపారు. గురువారం పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పెంబి మండల కేంద్రానికి చెందిన పిట్ల సాయన్న కూతురుకు వివాహం నిశ్చయమైంది. మేకలు కొనుగోలు చేసేందుకు బుధవారం సాయన్న శివరాత్రి మల్లేశ్, శివరాత్రి రెడ్డి మామడ మండల కేంద్రంలోని మేకల సంతకు వచ్చి ఆరు మేకలు కొనుగోలు చేశారు. ఒక్కో మేకకు రూ.20 చొప్పున రూ.120 ఇవ్వాలని సంత నిర్వాహకుడు షేక్‌చాంద్ అడ్డుకోవడంతో అతన్ని హత్యచేసి పారిపోయారు. గురువారం న్యూసాంగ్వి క్రాస్‌రోడ్డు సమీపంలో అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులను చాకచక్యంగా అరెస్ట్ చేసిన సీఐ నవీన్‌కుమార్, ఎస్సై అశోక్‌ను అభినందించారు.

అనుమానాస్పద రీతిలో యువకుడి మృతి

- ప్రేమవ్యవహారమేనని అనుమానం


మంతెన వినోద్ (ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: ఓ యువకుడు అనుమానాస్పద రీతిలో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని స్వీపర్ కాలనీకి చెందిన మంతెన లక్ష్మికి నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు న్నారు. వీరిలో ఇద్దరు కుమారులు ఇదివరకే అనారోగ్యంతో మృతి చెందారు. చిన్న కుమారుడు వినోద్ (29) బుధవారం రాత్రి 8 గంటలకు ఇంట్లో భోజనం చేశాక ఫోన్‌లో మాట్లాడుకుంటూ బయటకువెళ్లాడు. 9 గంటల సమయంలో కాలనీలో నిస్సహాయ స్థితిలో పడి ఉన్నాడు. గమనించిన కుటుంబీకులు రిమ్స్ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి శరీరంపై గాయాలు ఉండడంతో హత్య జరిగి ఉంటుందని కుటుంబీకులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. కాగా, వినోద్‌కు కొంతకాలంగా ఓ అమ్మాయితో ప్రేమ వ్యవహారం ఉంది. ఈ విషయంలో ఇరుకుటుంబాల మధ్య గొడవలు జరిగాయి. వినోద్‌ను హత్య చేసి ఉంటారా?.. లేదా ఇతర కారణాలేమైన ఉన్నాయా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. తన తమ్ముడిని హత్య చేసి ఉంటారని మృతుడి అన్న మురళి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు నమోదు చేశారు. వినోద్ మృతితో అతడి కుటుంబీకుల రోధనలు కంటతడి పెట్టించాయి. కాగా, వినోద్ కుటుంబ సభ్యులు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించారు. వినోద్ మృతికి కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

లక్ష్మణచాంద(నిర్మల్): ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రంలోని ఎస్సీ కార్పొరేషన్ కాంప్లెక్స్‌లో కొద్ది రోజులుగా పోతన్న (55) నివాసం ఉంటున్నాడు. గురువారం అతని గదిలో నుంచి వాసన రావడంతో అనుమానం వచ్చిన స్థానికులు వెళ్లి చూడగా ఉరేసుకుని కనిపించాడు. పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై రాహుల్ గైక్వాడ్ సంఘటన స్థలానికి వెళ్లి చూడగా మృతదేహం కుళ్లిపోయి ఉంది. వారం రోజుల క్రితం ఉరేసుకుని ఉండవచ్చని స్థానికులు పేర్కొంటున్నారు. ఎవరూ లేని అనాథ కావడంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మిస్సింగ్ కేసు నమోదు

వాంకిడి: మండలంలోని సరాండి గ్రామానికి చెందిన ఓ యువతి అదృశ్యం అయినట్లు ఎస్సై సాగర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని సరాండి గ్రామానికి చెందిన రత్నం సౌజన్య(20) బుధవారం మధ్యాహ్నం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. సౌజన్య మొబైల్ ఫోను సైతం స్విచ్‌ఆఫ్ రావడంతో తండ్రి రత్నం మోహన్‌బాబు గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

పెళ్లి బరాత్‌లో కత్తులతో హల్‌చల్

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని హైటెక్ సిటీలో బుధవారం అర్ధరాత్రి జరిగిన ఓ వివాహ వేడుకల్లో భాగంగా బరాత్ నిర్వహించారు. ఈ క్రమంలో గద్దెరాగడి సమీపంలోని అమ్మ గార్డెన్ ప్రాంతానికి చెందిన గుర్తు తెలియని ఇద్దరు యువకులు మద్యం మత్తులో డ్యాన్స్‌లు చేస్తున్న బృందంలో చొరబడి అల్లరి సృష్టించారు. దీంతో పెళ్లి కుటుంబ సభ్యులు అడ్డుకునే ప్రయత్నం చేయగా సదరు యువకులు కత్తులతో హంగామా సృష్టించారు. దీంతో గొడవ జరుగగా పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. గొడవకు పాల్పడిన ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సీఐ రాజు తెలిపారు.

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ప్రవేశానికి ఎంపిక

మంచిర్యాలఅగ్రికల్చర్: హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ఉచిత విద్యాభ్యాసానికి 1వ తరగతి ప్రవేశానికి జిల్లా నుంచి ఇద్దరు విద్యార్థులకు లక్కీ డ్రా పద్ధతిన ఎంపిక చేసినట్లు జిల్లా అదనపు కలెక్టర్ బి. రాహుల్ తెలిపారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో విద్యార్థుల ఎంపికకు నిర్వహించిన లక్కీ డ్రా కార్యక్రమానికి హాజరయ్యారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ 2023-24 విద్యా సంవత్సరానికి జిల్లాలోని షెడ్యూల్ కులం విద్యార్థుల నుంచి 17 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఇందులో బెల్లంపల్లి మండలం చంద్రవెల్లికి చెందిన జంగపల్లి అఖిలన్ శ్రేష్, నస్పూర్ మండలం గాంధీనగర్‌కు చెందిన బెక్కం శ్రేష్టలు ఎంపికయ్యారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు పి.రవీందర్‌రెడ్డి, సహాయ సాంఘిక సంక్షేమ అధికారి ఎం.రవీందర్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


అశోక్‌గౌడ్ మృతదేహం

మంచిర్యాలరూరల్ (హాజీపూర్): హాజీపూర్ మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నంనూర్ గ్రామానికి చెందిన రాసమల్ల అశోక్‌గౌడ్(33) మృతి చెందాడు. ఎస్సై నరేశ్‌కుమార్ కథనం ప్రకారం... నంనూర్‌కు చెందిన అశోక్‌గౌడ్ బుధవారం సొంత పనిపై హాజీపూర్ నుంచి ఇంటికి వస్తున్నాడు. హాజీపూర్ సబ్‌స్టేషన్ సమీపంలో అశోక్‌గౌడ్ వాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అశోక్ రెండు కాళ్లు నుజ్జునుజ్జు య్యాయి. స్థానికులు 108లో మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అశోక్‌గౌడ్ అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య నవ్య ఉంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలు నుంచి పడి యువకుడు దుర్మరణం


రాంకుమార్ (ఫైల్)

రెబ్బెన(ఆసిఫాబాద్): మండలంలోని పులికుంట గ్రామ సమీపంలో కైరిగూడ గ్రామానికి చెందిన ఆజ్మీర రాంకుమార్ (20) అనే యువకుడు ప్రమాదవశాత్తు రైలు నుంచి పడి మృతి చెందినట్లు బెల్లంపల్లి ఇన్‌చార్జి జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ సురేశ్‌గౌడ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం రాంకుమార్ కూలీ పనులు చేసుకుంటూ జీవించేవాడు. గురువారం తెల్లవారుజామున రాంకుమార్ బంధువు లక్ష్మణ్‌తో కలిసి భాగ్యనగర్ రైలులో ఖాజీపేట్‌కు బయలుదేరాడు. ఈక్రమంలో మండలంలోని పులికుంట సమీపంలో ప్రమాదవశాత్తు రాంకుమార్ రైలు నుంచి కింద పడటంతో అక్కడిక్కడే మృతి చెందాడు.

అదుపు తప్పి లారీ బోల్తా


బోల్తాపడిన లారీ



గాయపడిన లారీ డ్రైవర్ నరేశ్, క్లీనర్ బాలు

- ఎన్‌హెచ్ 363పై ప్రమాదం
- ఐదుగురికి తీవ్ర గాయాలు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం వద్ద నూతనంగా నిర్మించిన ఎన్‌హెచ్ 363 రోడ్డుపై గురువారం లారీ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం... మహారాష్ట్ర నుంచి పత్తి బేళ్ల లోడ్ వేసుకున్న ఆంధ్ర ప్రాంతానికి వెళ్తున్న లారీ రామకృష్ణాపూర్ నుంచి వస్తూ జీఎం కార్యాలయం వద్ద గల ఫ్లెఓవర్ వంతెన మీద నుంచి గోదావరిఖని వైపు దిగుతుండగా మూల మలుపు వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ ఎం.నరేశ్, క్లీనర్ బాలు గాయపడ్డారు. వీరు ఖమ్మం జిల్లా వాసులుగా గుర్తించారు. ప్రమాద సమయంలో రోడ్డు నిర్మాణ పనుల్లో ఇతర రాష్ట్రాల కూలీల పనిచేస్తున్నారు. లారీ బోల్తాపడడంతో అందులోని బేళ్లు కూలీపై పడడంతో సుధీర్‌బాయి, దేవరాజ్, కదాల్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు 108, పోలీసులకు సమాచారం అందించారు. వారు చేరుకుని క్షతగాత్రులను మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద స్థలాన్ని శ్రీరాంపూర్ ఎస్సై మానస పరిశీలించారు. ఓవర్‌లోడ్, స్పీడ్‌తోనే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. కొత్తగా నిర్మించిన ఈ రోడ్డుపై ఇదే మొదటి ప్రమాదం. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆ అపార్ట్‌మెంట్‌లో మళ్లీ చోరీ..

- సింగరేణి కార్మికుడి ఫ్లాట్‌లో బంగారు ఆభరణాల అపహరణ
- మూడు రోజుల వ్యవధిలో మూడిళ్లలో దొంగతనం
- ఆందోళనలో అపార్ట్‌మెంట్ వాసులు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఆదిత్య ఎన్‌క్లేవ్స్ కృతిక అపార్ట్‌మెంట్‌లో మరో చోరీ జరిగింది. మూడు రోజుల క్రితం రెండు ఫ్లాట్లలో ఇద్ద రు దొంగతనం చేశారు. తాజాగా గురువారం అదే అపార్ట్‌మెంట్‌లోని సింగరేణి కార్మికుడి ఇంటికి కన్నం వేశారు. ఆరు తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. సింగరేణి కార్మికుడు వినయ్ కుటుంబ సభ్యులు ఊరికి వెళ్లారు. వినయ్ రోజువారీగానే ఇంటికి తాలం వేసి విధులకు వెళ్లాడు. విధులు ముగించుకుని ఇంటికి వచ్చే సరికి మెయిన్ డోర్ తాళం పగలగొట్టి ఉంది. ఇంట్లోని బంగారు ఆభరణాలు కనిపించకపోవడంతో దొంతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుగుణాకర్ తెలిపారు.

పోలీసులకు సవాల్..

కృతిక అపార్ట్‌మెంట్‌లో వరుస దొంగతనాలు అపార్ట్‌మెంట్ వాసులను ఆందోళనకు గురిచేస్తున్నా యి. మూడు రోజుల పట్టపగలు ఇద్ద రు వ్యక్తులు కారులో వచ్చి రెండు ఫ్లాట్లలో చోరీ చేశా రు. సీసీ కెమెరాలు ఉన్నా... అనుమానితుల దృశ్యాలు అందులో నమోదైనా పోలీసులు వారి ని పట్టుకోలేదు. దీంతో తాజాగా గురువారం మ ధ్యాహ్నం మరో చోరీ జరగడం పోలీసులకు దొంగలు సవాల్ విసిరినట్లయింది. దొంగలు తాళం వేసి ఉన్న ఇళ్లనే టార్గెట్ చేస్తున్నారు. ముందే రెక్కీ నిర్వహించి చోరీలకు పాల్పడుతున్నట్లు తెలు స్తోంది. ఇప్పటికైనా పోలీసులు దొంగలను పట్టుకోవాలని కోరుతున్నారు.

పట్టపగలే ఇంటికి కన్నం


వేలిముద్రలు సేకరిస్తున్న అధికారులు

వాంకిడి: ఇంట్లో ఎవరూ లేని సమయంలో పట్టపగలే దొంగలు ఓ ఇంటికి కన్నమేసిన సంఘటన బుధవారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై డి.సాగర్ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రంలోని హనుమాన్‌వాడకు చెందిన మెంగ్రె తిరుపతి బుధవారం ఆసిఫాబాద్ మండలం దస్నాపూర్ గ్రామానికి ఉదయం 11 గంటలకు కుటుంబ సభ్యులతో కలిసి వివాహానికి వెళ్లాడు. అదేరోజు సాయంత్రం ఇంటికి తిరిగొచ్చే సరికి ఇంటి తాళం పగలగొట్టి ఉంది. ఇంటి లోపలికి వెళ్లి చూడగా సామాన్లు చిందరవందరగా పడి ఉండడంతో పాటు బీరువాలో ఉన్న 9 గ్రాముల నల్ల పూసల బంగారం తాడు, రూ.45 వేల నగదు దొంగతనానికి గురైనట్లు బాధితులు పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.